క్లుప్తంగా

నియామకం



నియమితులైన వారిని సన్మానిస్తున్న జాజుల

కవాడిగూడ: బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా వరంగల్ జిల్లాకు చెందిన బైరు రవికృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కుల్కచర్ల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ శనివారం దోమలగూడలోని బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో వారి నియామకాన్ని అధికారికంగా ప్రకటించి వారికి నియామక పత్రాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో బీసీ కుల సంఘాల ఐక్యవేదిక చైర్మన్ కుందారం గణేష్‌చారి, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్, బీసీ యువజన విభాగం అధ్యక్షుడు కనకాల శ్యామ్, డాక్టర్ విజయ్‌భాస్కర్, ఉద్యోగ సంఘాల నాయకులు సాయన్న, నాయకులు మాదేశి రాజేందర్, బండిగారి ఇంద్రం రజక తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా డాక్టర్ వెంకట్ చౌహాన్

ముషీరాబాద్: బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా డాక్టర్ వెంకటేష్ చౌహాన్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం బీఎస్పీ పార్టీ కార్యాలయంలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను వెంకటేష్ చౌహాన్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వెంకటేష్ చౌహాన్ మాట్లాడుతూ రాబోయే కాలంలో బహుజన్ సమాజ్ పార్టీని తెలంగాణలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన తెలంగాణ ఇన్‌చార్జీ రాంజీ గౌతమ్, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

'శివోత్సవం' పోస్టర్ ఆవిష్కరణ

కాచిగూడ: మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 18వ తేదీన ఎస్‌ఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో చిట్కుల్‌లోని శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో ఆధ్యాత్మిక, భక్తి కార్యక్రమం 'శివోత్సవం' నిర్వహిస్తున్నట్లు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ తెలిపారు. శివోత్సవంకు సంబంధించిన ఆహ్వాన పత్రికను శనివారం ఆయన ఆవిష్కరించారు.

వైభవ్‌నగర్ కాలనీ సమగ్రాభివృద్ధికి కృషి



కార్పొరేటర్ పద్మ వెంకట్‌రెడ్డితో కలిసి పార్కు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



కల్యాణలక్ష్మీ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్
- రూ.2 కోట్లతో వైభవ్‌నగర్ కాలనీలో అభివృద్ధి పనులు ప్రారంభం

అంబర్‌పేట: బాగ్ అంబర్‌పేట డివిజన్ వైభవ్ నగర్ కాలనీలో రూ.2 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. ఇందులో ఇప్పటికే కొన్ని పనులు పూర్తి కాగా మిగతా పనులు త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. శనివారం డివిజన్ కార్పొరేటర్ బి.పద్మ వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన పార్కు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఇంకా కొన్ని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గాయత్రి టవర్ నుంచి వైభవ్‌నగర్ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని, పార్కును అందంగా తీర్చిదిద్దాలని చెప్పారు. అలాగే వరదనీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే వైభవ్‌నగర్ పార్కును రూ.75లక్షలతో సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. స్థానిక కాలనీవాసులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు ఈ పార్కును సుందరంగా రూపుదిద్దుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పార్కులో ఫౌంటేన్, చుట్టూ చైన్ లింగ్ మెష్, బల్లలు, పచ్చటి గడ్డి పరుపు, అందమైన మొక్కలు అన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గాయత్రి టవర్ నుంచి కాలనీ లోపలకు రూ.30 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం కూడా చేపడుతున్నామన్నారు. సీజన్స్ హాస్పిటల్ వద్ద రూ.25 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయిందని, గీతా కాన్వెంట్ స్కూల్ వద్ద రూ.14 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేయడం జరిగిందన్నారు. గాయత్రి టవర్స్ దగ్గర రోడ్డు నిర్మాణం పూర్తయితే గత కొన్నేళ్లుగా ఉన్న వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తోందని వెల్లడించారు. వైభవ్ నగర్‌లో ఎప్పటికీ ఏర్పడే వరదనీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కాలనీ వాసులు ఒక ఆలోచనకు వస్తే ఆ సమస్యను కూడా పరిష్కరిస్తామన్నారు. కాలనీని సమగ్రంగా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, ఉద్యానవన శాఖ అధికారి హుస్సేన్, కాలనీ ప్రతినిధులు డాక్టర్ చారి, డాక్టర్ మధుసూదన్ రెడ్డి, సిద్ధార్థ, వేణుగోపాల్, డాక్టర్ హరిచరణ్, కెవి నారాయణ, డాక్టర్ భగవాన్ రెడ్డి, సురేష్, శ్యాంసుందర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ..

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో సీఎం కేసీఆర్ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కల్యాణలక్ష్మీ పథకాన్ని ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శనివారం అంబర్‌పేట తహసీల్దార్ సీహెచ్ లలితతో కలిసి 78 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.1,00,116 చొప్పున చెక్కులను అందించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రథం నిర్మాణానికి దాతల సహకారం అభినందనీయం

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



దాతల నుంచి సేకరించిన చెక్కును రథం తయారీ దారుడికి అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ: నియోజకవర్గం పరిధిలోని కవాడిగూడ డివిజన్ దోమలగూడలోని హనుమాన్ దేవాలయంలో నూతన రథ నిర్మాణానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. రూ.4లక్షల చెక్కును శనివారం రథం తయారు చేసే దశరథ చారికి ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆలయానికి తప్పనిసరిగా రథం ఉండాల్సిన అవసరం ఉందని, ఆలయానికి వచ్చే భక్తులు స్వచ్ఛందంగా రథ నిర్మాణానికి ముందుకు వచ్చి తమ వంతు ఆర్థిక సహకారం అందించాలని ఆయన కోరారు. ఇప్పటి వరకు ఆర్థిక సాయం అందించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ముఠా జైసింహ, ఆలయ ఈఓ దేవనాథం, చైర్మన్ జి.రాజశేఖర్‌గౌడ్, ఆలయ ధర్మకర్తలు పురుషోత్తం, వేణుగోపాల్, సంతోష్‌కుమార్, తడకల శేఖర్, మహేందర్, లావణ్య, హనుమంతరావు, శర్మ, మోహన్, శ్యామ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి సాయికృష్ణ, ఆర్.రాంచందర్, ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగును మరవకుండా 'బాటా' కృషి



బాటా సంస్థ అధ్యక్షులు చికోటి హరినాథ్‌ను అభినందిస్తున్న కలవెండి కేఎస్ మూర్తి

కాచిగూడ: తెలుగు భాషా సంస్కృతి, కళలను తమ వారసులు మరవకుండా సజీవంగా ఉండాలని కాలిఫోర్నియాలో ఏర్పడిన ఓ ఎన్‌ఆర్‌ఐ సంస్థ 'బే ఏరియా తెలుగు అసోసియేషన్' బాటా సంస్థ ఇటీవల స్వర్ణోత్సవాలను మిలిపిటాస్‌లో ఘనంగా జరుపుకుంది. ప్రవాస భారత తెలుగు వారు సంస్థలు చేస్తున్న సంస్కృతి, కళా సేవల ఔన్నత్యాన్ని గుర్తించి, గౌరవిస్తున్న, అంతర్జాతీయ తెలుగు సారస్వత సాంస్కృతిక సంస్థ (ఇట్ క్లా) మిలిపిటాస్‌లో జరిగిన సంక్రాంతి సంబరాల్లో 'బాటా' సంస్థకు, 'ఇట్ క్లా' సంస్థ అభినందన పురస్కారాన్ని సంస్థ అమెరికా కార్యనిర్వాహక అధ్యక్షుడు కలవెండి కేఎస్ మూర్తి బహూకరించారని ఇట్‌క్లా అధ్యక్షుడు, సంస్కృతి రత్నా డాక్టర్ కె.ధర్మారావు తెలిపారు. కార్యక్రమంలో బాటా సంస్థ అధ్యక్షుడు హరినాథ్ చికోటి, ఉపాధ్యక్షుడు కొండల కొమరగిరి, విజయ అసూరి, ఉప్పల వీరు, ప్రసాద్ మంగిన, వెలిగేటి కరుణ్, కట్టమూరి కల్యాణ్, బత్తుల శిరీష, పసుపులేటి శ్రీదేవి, వెలిగేటి శ్రీలు, తానా సంస్థ కార్యదర్శి సతీష్ వేమూరి, తానా ప్రముఖులు తోట రామ్ తదితరులు పాల్గొన్నారని డాక్టర్ కె.ధర్మారావు తెలిపారు.

ఉద్రిక్తతకు దారి తీసిన పీడీఎస్‌యూ చలో అసెంబ్లీ



అసెంబ్లీ వద్ద పీడీఎస్‌యూ విద్యార్థులను అడ్డుకుంటున్న పోలీసులు

ముషీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని శనివారం చేపట్టింది. విద్యార్థులు పోలీసుల కళ్లుగప్పి అసెంబ్లీ వద్దకు చేరుకుని నినాదాలు చేస్తూ ఒక్కసారిగా అసెంబ్లీ వైపు దూసుకెళ్లడానికి ప్రయత్నించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు విద్యార్థులను బలవంతంగా అడ్డుకుని అరెస్టు చేసి నగరంలోని వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.రామకృష్ణ, నామాల ఆజాద్‌లు పాల్గొని విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు పృధ్వీ, నరేందర్, సంధ్య, నర్సింహారావు, సురేష్, అజయ్, గణేష్, సీతారామ్, రాకేష్, సతీష్, దీపిక, పవిత్ర, సింహాద్రీ తదితరులు పాల్గొన్నారు. కాగా అరెస్టు చేసిన విద్యార్థులను తక్షణమే విడుదల చేయాలని విద్యా పరిరక్షణ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ కె.చక్రధర్‌రావు, ప్రొఫెసర్ అరగోపాల్, ప్రొఫెసర్ లక్ష్మినారాయణలు డిమాండ్ చేశారు.



డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో అసాంఘిక శక్తుల ఆగడాలు పెరిగిపోయాయని, కొన్నిచోట్ల రాత్రి పూట శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని, ఆయా ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు, నిఘా ఉంచాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌ను కోరుతున్న గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్. – కాచిగూడ

విద్యాపరమైన సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యమివ్వాలి



వాసవి విద్యార్థిని వసతి గృహం వార్షికోత్సవంను ప్రారంభిస్తున్న టీజీ వెంకటేష్

కాచిగూడ: విద్యాపరమైన సేవా కార్యక్రమాలకు ఆర్యవైశ్యులు అధిక ప్రాధాన్యత ఇచ్చి సమాజ సేవలో తరించాలని మాజీ మంత్రి, టీజీవీ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ చైర్మన్ టీజీ వెంకటేష్ అన్నారు. వాసవి విద్యార్థిని వసతి గృహం 40వ వార్షికోత్సవ వేడుకలను శనివారం రాత్రి కాచిగూడలోని వైశ్య హాస్టల్‌లో ఘనంగా నిర్వహించారు. సమాజ సేవను దైవంగా భావించి సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. వైశ్య కమ్యూనిటీలోని పేద విద్యార్థులకు చేయూతనివ్వాలని కోరారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. తల్లిదండ్రులు కన్న కలలను సాకారం చేసేందుకు కృషి చేయాలని కోరారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజంలో నైతిక విలువలను నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతిభ కలిగిన నిరుపేద విద్యార్థులను ప్రోత్సహించడానికి మరిన్ని సంస్థలు ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థినిలకు స్కాలర్ షిప్ చెక్కులు, కాలేజీ బ్యాగ్ కిట్స్ అందజేశారు. వైశ్య ప్రముఖులను, దాతలను ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో వైశ్య హాస్టల్ ట్రస్ట్ బోర్డు చైర్మన్ బూర్గు సూర్యప్రకాష్ రావు, వాసవి విద్యార్థిని వసతి గృహం అధ్యక్షురాలు డాక్టర్ ఉప్పాల శారద, కొత్రికె భాస్కర్ గుప్తా, బండారు సుబ్బారావు, టీజీవీ ప్రసాద్, చీగుళ్లపల్లి ఝాన్సీ లక్ష్మీ, కొత్రికె విజయ గుప్తా, కొత్తూరు జయప్రకాష్ రామ్, ఆగిరి రాధ, ఆగిరి వెంకటేష్, సోమ నాగవర్ధిని, గజ్జల సుజాత తదితరులు పాల్గొన్నారు.

పీడిత ప్రజల విముక్తికి పోరాడిన యోధుడు మఖ్దూం



మఖ్దూం విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

కవాడిగూడ: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, రచయిత, మఖ్దూం మొయినుద్దీన్ పీడిత ప్రజల వి ముక్తి కోసం రాజీలేని పోరాటం చేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు నర్సింహ అన్నారు. నేటి యువత మఖ్దూం మొయినుద్దీన్ ఆశయాలు, పోరాట పటిమను ఆదర్శంగా తీసుకుని ప్రజా పోరాటాల్లో భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం మఖ్దూం 115వ జయంతి సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీఎస్ బోస్, నగర సహాయ కార్యదర్శి స్టాలిన్, కార్యవర్గ సభ్యులు చంద్రమోహన్, శ్రీకాంత్, శ్రీనివాస్, కిషన్, ధర్మేంద్ర, లతీఫ్, కల్యాణ్, సుమంత్ పాల్గొన్నారు.

అవార్డుల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల మహిళామణులను మహిళారత్న, మహిళా శిరోమణి అవార్డుతో సత్కరించనున్నట్లు సర్వేజనా సుఖినో భవంతు సామాజిక సాంస్కృతిక సేవా సంస్థ స్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 12న అవార్డుల ప్రదానం జరుగుతుందని, పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, అనాథలు, మహిళామండలి కార్మికులు, కర్షకులు, ఉమ్మడి కుటుంబాలతో పాటు నిరక్షరాస్యత నిర్మూలన, వరకట్న నిషేధం, కులాంత, మతాంతర వివాహాల ప్రోత్సాహానికి కృషి చేస్తూ తమ వంతుగా సేవలందిస్తున్న విద్య, వైద్య, ఆధ్యాత్మిక, సంగీత, నృత్య, సాహిత్య, సాంస్కృతిక, టీవీ, సినిమా, కళా, క్రీడా, జ్యోతిష్య, వాస్తు, యోగా, కరాటే, మ్యాజిక్, మిమిక్రీ రంగాలల్లో ప్రతిభావంతులైన మహిళలకు ఈ అవార్డులు ఇస్తామన్నారు. మహిళలు వారి సేవలు, ప్రతిభను గురించి తెలియజేసే వివరాలతో ఈ నెల 15లోపు సంప్రదించాలని, ఇతర వివరాలకు సెల్: 9652347207 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

బాకారంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ బాకారంలో నెలకొన్న లోప్రెజర్, కలుషిత నీటి సరఫరాను అరికట్టాలని, అధ్వానంగా ఉన్న రోడ్లను పునర్నిర్మించాలని, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు బీఆర్‌ఎస్ నాయకులకు, జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. డివిజన్‌లోని బాకారంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డివిజన్ బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు ప్రవీణ్, కార్యదర్శి శ్రావణ్‌ల ఆధ్వర్యంలో శనివారం బీఆర్‌ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ, జలమండలి సెక్షన్ మేనేజర్ నవీన్, జీహెచ్‌ఎంసీ ఏఈ సుభాష్ తదితరులు పర్యటించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, ఉమాకాంత్, మహ్మద్ అలీ, రహీం తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోండి



స్నాతకోత్సవంలో పట్టాలు అందుకుంటున్న విద్యార్థులు

కాచిగూడ: రోజురోజుకు శాస్త్ర సాంకేతిక రంగాల్లో విస్తృతమవుతున్న అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ సెంట్రల్ ఫెసిలిటీస్ ఫర్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డి.కరుణ సాగర్ అన్నారు. బర్కత్‌పురాలోని అవంతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో శనివారం ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థుల స్నాతకోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో జీఎంఆర్ కార్గో సీఈఓ సౌరబ్ కుమార్, పోలారీస్ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ రవి కోసూరి, అవంతి విద్యాసంస్థల ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎం.ప్రియాంక, డైరెక్టర్ (హెచ్‌ఆర్) డాక్టర్ వై.జయప్రద, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అప్పారావు, నవీన్ చంద్ర, కళాశాల సిబ్బంది, లెక్చరరర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

వీఎస్టీ కార్మికులకు మెరుగైన సేవలందించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వీఎస్టీ కార్మికులకు మెరుగైన సేవలు అందించేందుకు వీఎస్టీ కన్స్యూమర్ సొసైటీ కృషి చేయాలని వీఎస్టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌రెడ్డి కోరారు. రిటైర్డయిన, చనిపోయిన కార్మికులకు వీఎస్టీ కన్స్యూమర్ సొసైటీ నుంచి రావాల్సిన షేర్లకు సంబంధించిన మొత్తాన్ని చెక్కుల రూపంలో శనివారం వీఎస్టీ యూనియన్ కార్యాలయంలో పంపిణీ జరిగింది. కన్స్యూమర్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వీఎస్టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌లు ముఖ్య అతిథిలుగా హాజరై చెక్కులను పంపిణీ చేశారు. సొసైటీ ప్రధాన కార్యదర్శి జానకిరాం, ఉపాధ్యక్షులు పాల్‌సింగ్, మహమూద్ అలీఖాన్, అసిస్టెంట్ సెక్రెటరీ రాజేశ్వర్, డైరెక్టర్లు సుభాష్, నాగరాజు, ప్రభాకర్‌రెడ్డి, సత్యనారాయణ, వీఎస్టీ వర్కర్స్ యూనియన్ కోశాధికారి నాగేందర్‌గౌడ్, అసిస్టెంట్ సెక్రెటరీ రవీందర్‌యాదవ్, రణదీర్‌రెడ్డి, మధుసూధన్, శంకర్ పాల్గొన్నారు.

ఐటీ ఉద్యోగిని అదృశ్యం



శ్రీశివనాగ హర్షిత

నల్లకుంట: విధులకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లిన ఓ ఐటీ ఉద్యోగిని అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్సై ఎం.అంజయ్య వివరాల ప్రకారం.. ప్రైవేటు ఉద్యోగి పగడాల ఉమా శంకర్ కుటుంబ సభ్యులతో కలిసి రాంనగర్ గుండు సమీపంలో గల దుర్గా నివాస్ అపార్ట్‌మెంట్‌లోని 301 ఫ్లాట్‌లో నివాసముంటున్నారు. ఆయన ఏకైక కుమార్తె శ్రీశివనాగ హర్షిత(24) హైటెక్ సిటీలోని ఓ ఐటీ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. గత నెల 24న ఉదయం 8 గంటల సమయంలో విధులకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి నేటికీ తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన తండ్రి ఉమా శంకర్ తమ కుమార్తె కనిపించడం లేదంటూ శనివారం సాయంత్రం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా శ్రీశివనాగ హర్షిత, రాము అనే యువకుడు ప్రేమించుకున్నారని, వారి ప్రేమను తాము అంగీకరించలేదని ఉమా శంకర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ముషీరాబాద్: యూటర్న్ చేస్తున్న ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని మరో వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన ఘటన ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌యాదవ్ వివరాల ప్రకారం.. ముషీరాబాద్‌లో కార్తీక్ అనే యజమాని పానీపూరి బండిపై ఔటి కృష్ణ(22) పని చేస్తున్నాడు. కృష్ణ శనివారం ఉదయం 8.30 గంటలకు కార్తీక్ హోండా యాక్టివా ద్విచక్ర వాహనానికి ఆలయానికి తీసుకెళ్లి పూజ చేయిస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. అయితే ముషీరాబాద్ ప్రధాన రహదారిలో యూటర్న్ చేస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడిని వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కృష్ణ మృతి చెందాడు. కృష్ణ సోదరుడు ఔటి గుండప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా 'టైమ్ కిడ్స్' వార్షికోత్సవం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నల్లకుంటలోని టైమ్ కిడ్స్ పాఠశాల 14వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. కాగా నృత్యాలతో చిన్నారులు ఆకట్టుకున్నారు. టైమ్ కిడ్స్ సెంటర్ హెడ్ శ్రీదేవి పాల్గొన్నారు.

కేసులు ఎత్తివేయండి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా ఆందోళనలు చేస్తున్న వారిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేసిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోటతా రమేష్, ఆనగంటి వెంకటేశ్‌లు డిమాండ్ చేశారు. 28 మంది అభ్యర్థులపై కేసులు నమోదు చేశారని, వారి డిమాండ్లను పరిష్కరించని రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా కేసులను నమోదు చేయడాన్ని డీవైఎఫ్‌ఐ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ప్రభుత్వం వారిపై పెట్టిన క్రిమినల్ కేసులను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

సీడబ్ల్యూఎస్ సభ్యులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి



వర్క్‌షాప్‌లో పాల్గొన్న వారిని అభినందిస్తున్న ఆనంద్ శర్మ

నల్లకుంట: ఎల్లవేళలా వినియోగదారులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించడంలో జాతీయ కన్స్యూమర్ వెల్ఫేర్ సొసైటీ (సీడబ్ల్యూఎస్) నిరంతరం కృషి చేస్తోందని సీడబ్ల్యూఎస్ జాతీయ అధ్యక్షుడు ఆనంద్ శర్మ తెలిపారు. తమ సొసైటీ సభ్యుల సేవలను గుర్తించి రాబోయే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీలుగా 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. నాగ్‌పూర్ అగ్రసేన్ భవన్‌లో రెండు రోజుల పాటు జరుగనున్న సీడబ్ల్యూఎస్ నేషనల్ వర్క్‌షాప్ శనివారం ప్రారంభమైంది. ఈ వర్క్‌షాప్‌లో నల్లకుంటకు చెందిన సీడబ్ల్యూఎస్ జాతీయ అధికార ప్రతినిధి ఎం.ఐజాక్ రాజ్ పాల్గొని మాట్లాడుతూ ఈ తీర్మానాలను త్వరలో రాష్ట్రపతి, ప్రధాన మంత్రికి అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. శిక్షణా శిబిరంలో పాల్గొన్న ప్రతినిధులకు సీడబ్ల్యూఎస్ జాతీయ అధ్యక్షుడు ఆనంద్ శర్మ సర్టిఫికెట్లు అందజేశారన్నారు. ఈ వర్క్‌షాప్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా చైర్మన్ మామిడి భీమ్‌రెడ్డి పాల్గొన్నారు.

వీవీ హాస్టల్‌ను పునః ప్రారంభించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వివేక వర్ధిని కళాశాలలో వీరశైవ లింగాయత్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన హాస్టల్‌ను వెంటనే పునః ప్రారంభించాలని వీరశైవ లింగాయత్ బలిజ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు పటోళ్ల సంగమేశ్వర్ డిమాండ్ చేశారు. బాగ్‌లింగంపల్లి సుందయ్య విజ్ఞాన కేంద్రంలో వీవీ హాస్టల్ అభివృద్ధి కమిటీ సమావేశం శనివారం జరిగింది. సంగమేశ్వర్ మాట్లాడుతూ.. కోవిడ్ సమయంలో మూసి వేసిన హాస్టల్‌ను వీవీ కళాశాల ట్రస్ట్ మేనేజ్‌మెంట్ వెంటనే తిరిగి ప్రారంభించాలన్నారు. ప్రస్తుతం వీవీ హాస్టల్‌ను మూసి వేసి ఉండటంతో వీరశైవ లింగాయత్‌లకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి శివ, కోశాధికారి దినేష్‌పాటిల్, గ్రేటర్ అధ్యక్షుడు శివచరణ్, యువజన విభాగం అధ్యక్షులు కట్లేపల్లి రాచప్ప, మహిళా విభాగం అధ్యక్షురాలు శెట్టి మంజుల, అడ్వకేట్ మహేష్, సతీష్, ఈశ్వర్‌ప్రసాద్, గుండప్ప, బస్వరాజ్, శివకుమార్, కొండ వీరప్ప పాల్గొన్నారు.